క్లుప్తంగా

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

నేలకొండపల్లి: దివ్యాంగుల సంక్షేమం కోసం రూ.75 కోట్లు కేటాయించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామని దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కట్టెకోల వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమం కోసం నిధి కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే దివ్యాంగులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు ప్రత్యేక కోటా ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు వడ్డె సుబ్బారావు, వి.నాగమణి, జీ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆర్‌డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ.. పదిహేళ్ల నుంచి ఇప్పటివరకు ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, ఫలితంగా ప్రభుత్వ పథకాలకు కొందరు అర్హులు దూరమవుతున్నారన్నారు. వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, రవీందర్, జ్వాలా నర్సింహారావు, ఎండీ రెహమాన్, శేఖర్‌నాయక్, సురేష్, కరీం పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఖమ్మంలీగల్: బాలికలు బాల్యదశ నుంచే వారి రక్షణకు సంబంధించిన వివిధ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సీనియర్ న్యాయవాది పాలిశెట్టి పద్మావతి అన్నారు. శుక్రవారం వెలుగుమట్ల సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికల అక్రమ రవాణా, సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, గుడ్ అండ్ బ్యాడ్ టచ్ గురించి తెలుసుకుని వాటి బారిన పడకుండా జాగ్రత్తలు పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి జ్యోతి, ఏఐడీ సంస్థ కో ఆర్డినేటర్లు శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

కోలాట బృందాలకు చీరలు, గజ్జెలు అందజేత



కోలాట సామగ్రి అందిస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా శిక్షణ పొందిన కోలాట బృందానికి మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ బోయినపల్లి లక్ష్మణ్‌గౌడ్, పర్వత సైదులు సహకారంతో చీరలు, గజ్జలు అందజేశారు. శుక్రవారం గ్రామంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించాక వాటిని అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కామేపల్లి: పండితాపురం గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ ప్రతిష్ఠ మొదటి వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి గణపతిబొట్ల మధుసూదన్‌శర్మ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలతో పాటు సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. అదేవిధంగా కొమ్మినేపల్లి, పండితాపురంలో బొడ్రాయికి జలాభిషేకం చేశారు. మేళతాళాలతో మహిళలంతా బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా ముత్యాలమ్మతల్లి ఆలయాల వద్దకు చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	50	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	18	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	56	చుక్కకూర	3
బీర	38		20
దొండ	18	తోటకూర	4
పొట్లకాయ	56		20
చిక్కుడు	78	గోంగూర	4
గోరుచిక్కుడు	66		20
క్యాబేజీ	30	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	40	కొత్తిమీర	1
చామగడ్డ	46		50
క్యారెట్	46	పుదీన	1
క్యాప్సికం	90		30

–ఖమ్మం వ్యవసాయం

మెనూ ప్రకారం భోజనాలు అందించండి



పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యత కలిగిన భోజనాలను అందించాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సూచించారు. మండలంలోని చెరువుమాధారం జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించిన ఆయన రికార్డులు తనిఖీ చేశారు. ఆతర్వాత మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించడంతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి మాట్లాడారు. జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఎంఈఓ బి.రాములు, ఎంపీఓ సీహెచ్.శివ, బీఆర్‌ఎస్ నాయకులు పెద్దపాక వెంకటేశ్వర్లు, మరికంటి రేణుబాబు, కుక్కల సామేలు తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్ల సమస్య పరిష్కారానికి కృషి



కూనంనేనికి వినతిపత్రం ఇస్తున్న స్వీపర్లు

ఖమ్మంమయూరిసెంటర్: పాఠశాలల్లో కరోనా సమయాన విధుల నుంచి తొలగించిన స్వీపర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. 2015లో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా రూ.2,500 కనీస వేతనంతో స్వీపర్లను ప్రభుత్వం నియమించగా, కరోనా సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 27వేల మందిని తొలగించింది. దీంతో వారు శుక్రవారం ఖమ్మంలో సాంబశివరావును కలవగా ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ నాయకులు శింగు నర్సింహారావు, సీహెచ్.సీతామహాలక్ష్మి, మీరాబీ, రషీద్, మలేకా, అనూష, ఉమా మహేశ్వరి, కృష్ణవేణి, కమలమ్మ పాల్గొన్నారు.

సేవాలాల్ మండల కమిటీ ఎన్నిక

ఖమ్మంరూరల్: రూరల్ మండల సేవాలాల్ కమిటీ ఎన్నిక శుక్రవారం పెదతండాలో నిర్వహించినట్లు సేవాలాల్ జిల్లా కన్వీనర్ బానోత్ శ్రీకాంత్ తెలిపారు. ఈమేరకు సేవాలాల్ మండల అధ్యక్షుడిగా హలావత్ సురేష్, గౌరవ అధ్యక్షుడిగా బానోత్ పృథ్వీరాథోడ్, ప్రధాన కార్యదర్శిగా లకావత్ నాగేశ్వరరావు, గౌరవ సలహాదారుడిగా ధరావత్ చిరంజీవి ఎన్నికయ్యారు. అదేవిధంగా యువజన విభాగం అధ్యక్షుడిగా ధరావత్ రాంబాబునాయక్, రైతు సంఘం అధ్యక్షుడిగా బాజిరి ఏశేశ్వరం, మహిళా సేవా అధ్యక్షురాలిగా బి.సుశీల ఎన్నికయ్యారు. అనంతరం వారికి ఎన్నిక పత్రాలు అందించినట్లు శ్రీకాంత్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 11 కేవీ డైయిరీ, 11 కేవీ మైసమ్మ గుడి ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఖమ్మం అర్బన్ సెక్షన్ ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో డైయిరీ ఫీడర్‌లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, గుడి ఫీడర్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలీసుకాలనీ, రాఘవయ్యనగర్, రాధాక్రిష్ణనగర్, మమతరోడ్డు, వరదయ్యనగర్, ఇందిరానగర్ తదితరల ప్రాంతాల్లో విద్యుత్ కోత విధించబడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

'చలో రాజ్‌భవన్'ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంరూరల్: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు నిరసనగా, పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా జూలై 6న నిర్వహించే చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదిర్శ గోకినేపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కాచిరాజుగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పసిపిల్లల నుంచి మహిళల వరకు మానవత్వం లేకుండా చంపివేయబడ్డారని దీన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాస్‌లైన్ నాయకులు టి.హనుమంతరావు, బందెల వెంకయ్య, సోమనపల్లి వెంకటేశ్వరరావు, మలీదు నాగేశ్వరరావు, మారుతి మల్లయ్య, రెంపుల వెంకన్న, రెంటాల యాదగిరి, ఎడ్లపల్లి నవీన్, పి. రామదాసు, ఉపేందర్, వీర్ల వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎస్ఈ సురేందర్

కూసుమంచి: గ్రామాల్లో సాధ్యమైనంత వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ఎస్‌ఈ సురేందర్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం కూసుమంచిలోని విద్యుత్ రెవెన్యూ సెక్షన్ (ఈఆర్‌ఓ) కార్యాలయాన్ని ఆయన సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తొలుత విద్యుత్ సరఫరా తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే ముందస్తుగా గుర్తించి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. అంతేకాక పెండింగ్ విద్యుత్ బిల్లుల వసూళ్లను వేగవంతం చేసి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. కాగా, కూసుమంచిలోని ఈఆర్‌ఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగి రూ.80వేల స్వాహాకు పాల్పడి సస్పెన్షన్‌కు గురికాగా తదుపరి విచారణ నిమిత్తం ఎస్‌ఈ మరిన్ని వివరాలు సేకరించినట్లు సమాచారం. ఈ సమావేశంలో డీఈ నాగేశ్వరరావు, కూసుమంచి ఏడీఈ కోక్యానాయక్, ఏఈలు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ సునీత

కామేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా లబ్ధిదారులందరికీ అందిస్తుందని ఎంపీపీ బానోత్ సునీత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురికి మంజూరైన రూ.7,00,812ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్‌లో పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ పక్కాగా అమలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మలపాటి సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్లు గుజ్జర్లపూడి రాంబాబు, ధనియాకుల హన్మంతరావు, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, మల్లెంపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలకు పోటెత్తుతున్న అర్జీలు

నాలుగు పంచాయతీల్లో మొత్తం 272 దరఖాస్తులు స్వీకరణ

నేలకొండపల్లి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల మండలంలో పర్యటించిన సమయాన ప్రజలు రెవెన్యూకు సంబంధించిన వినతులు ఎక్కువగా ఇచ్చారు. ఈమేరకు మంత్రి స్పందించి రెవెన్యూ అధికారులు ప్రతీ రోజు గ్రామాలకు వెళ్లి గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో నేలకొండపల్లి మండలంలోని తహసీల్దార్ గౌరీశంకర్ గ్రామ సభలు ప్రారంభించారు. ఈమేరకు మొత్తం 272 దరఖాస్తులు రాగా ఇందులో భైరవునిపల్లి-07, రాయగూడెం-67, మంగాపురం-190, అప్పలనరసింహాపురం-08 దరఖాస్తులు అందాయి.కాగా, వీటి పరిష్కారం కోసం రెవెన్యూ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈమేరకు శుక్రవారం భైరవునిపల్లి గ్రామసభలో డిప్యూటీ తహసీల్దార్ ఇమ్రాన్ మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలను గ్రామ సభల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

సన్మానం..

కామేపల్లి: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు గుడిపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొమ్మినేపల్లి, మద్దులపల్లి హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎస్.వెంకటేశ్వర్లు, రామ్మోహన్‌రావు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా శుక్రవారం ఆయా పాఠశాలల్లో సన్మాన కార్యక్రమం నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడగా.. హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీపై రైతుల ఆందోళన

కూసుమంచి: మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన పలువురు రైతుల విద్యుత్ మోటార్లు చోరీకి గురికావడంతో శుక్రవారం రైతులు ఆందోళన చేపట్టారు. గురువారం తెల్లవారు జామున గ్రామానికి చెందిన నూకల కృష్ణయ్య, హుస్సేన్, బత్తుల ఉప్పయ్య, బదావత్ కిషన్, వెంకన్న తదితర రైతులకు చెందిన మోటార్లను దుండగులు చోరీ చేశారు. ఈమేరకు బాధిత రైతులు ఆందోళన చేపట్టాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. రహదారికి పక్కన ఉన్న వ్యవసాయ బావులు, బోర్లకు ఏర్పాటు చేసిన మోటార్లు చోరీకి గురి కాకుండా పోలీసులు నిఘా వేసి నిందితులను పట్టుకోవాలని రైతులు కోరారు.

బ్యాగ్‌ల పంపిణీ



విద్యార్థినికి బ్యాగ్ అందిస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సోదరుడు విశ్వేశ్వరరావుడి కుమారుడు తాతా నిఖిల్ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన కుటుంబసభ్యులు స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. నిఖిల్ చౌదరి గతేడాది అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన జయంతి సందర్భంగా బ్యాగ్‌లతో పాటు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఖమ్మం రూరల్ ఎంపీపీ బెల్లం ఉమారాణి, పిండిప్రోలు ఎంపీటీసీ పి.వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం లక్ష్మీసుజాత తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి

ఆర్థిక సంస్కరణలు తెచ్చి, దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిన మహనీయుడు పీవీ నర్సింహారావు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. పీవీ 103వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. మైనార్టీ ప్రభుత్వాన్ని సైతం ఐదేళ్లు నడిపిన ఘనత ఆయనకు దక్కుతుందని, ఆర్థికంగా దివాలా తీసిన స్థితిలోనూ దేశాన్ని తన మేధస్సుతో ముందు వరుసలో నిలబెట్టారని కొనియాడారు. –సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంవన్‌టౌన్: ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో పీవీకి నివాళులర్పిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి



ఖమ్మంమయూరిసెంటర్: లకారం ట్యాంక్‌బండ్ కూడలిలో నివాళులర్పిస్తున్న మేయర్, తదితరులు



ఖమ్మంగాంధీచౌక్: నివాళులర్పిస్తున్న నియోగి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

హైవేపై ఎంట్రీ పాయింట్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేకి బోనకల్ రోడ్డులోని ధంసలాపురం వద్ద (ఎన్‌హెచ్ 365బీజీ, కేఎం 12+102) ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఇవ్వాలని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు మేడారపు వెంకటేశ్వర్లు, మందడపు లక్ష్మీమనోహర్, ఆళ్ల నిరీషా అంజిరెడ్డి, మదూరి ప్రసాద్‌లు మాట్లాడారు. కోట్ల రూపాయల విలువైన భూములను గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం ఇచ్చినప్పటికీ కనీసం తమను రోడ్డు ఎక్కనివ్వడానికి కూడా సౌకర్యం ఏర్పాటు చేయలేదని నేషనల్ హైవే అథారిటీ అధికారుల వైఖరిపై మండిపడ్డారు. ఖమ్మం నుంచి ఆంధ్రాలోని విజయవాడకు వెళ్లేందుకు, నగరంలోని చింతకాని, బోనకల్లు మండలాలకు చెందిన వేలాది మంది ప్రజలకు ఈ ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు అవసరమన్నారు. కాగా, ఈ విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మందడపు ప్రభాకర్‌రెడ్డి, దేవరపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మందడపు బ్రహ్మారెడ్డి, అమరగాని వెంకన్న, శ్రీరామ్ హిల్స్ సొసైటీ అధ్యక్షుడు బెల్లం మనోహర్‌చౌదరి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

ఖమ్మంరూరల్: ఎన్నికల సమయాన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని తెల్దారుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఉన్న అన్ని సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలని, రూ.2లక్షల రుణమాఫీ రైతులందరికీ వర్తింపజేయాలన్నారు. గత నాలుగేళ్ల నుంచి నత్తనడకన సాగుతున్న సీతారామ ప్రాజెక్ట్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వమైనా వేగవంతంగా పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్‌కు నీటిని తరలించాలని చెప్పారు. ఇప్పటికే గత రెండేళ్ల నుంచి సాగర్ కింద భూములు నీటి వసతి లేక బీడుగా మారాయని ఈ ఏడాది అలా కాకుండా చూడాలన్నారు. అలాగే కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, ధరణిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చూడాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు సిద్దినేని కోటయ్య, పెండ్యాల సుమతి, గొడ్డేటి రాజేశ్వరి, సిరికొండ నగేష్, మల్లెబోయిన రాజశేఖర్, పి.వెంకన్న, వెంకట్రావు, టి. సుజాత, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న అవనీకాంత్, పక్కన సత్యనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు క్యాడర్ సిద్ధంగా ఉండాలని బీజేపీ జాతీయ నాయకుడు, తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల వార్‌రూం ఇన్‌చార్జ్ అవనీకాంత్ పాండే కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో కలిసి ఖమ్మంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత మూడు రోజులుగా ఖమ్మం జిల్లాలోని నాయకులు, కార్యకర్తలను కలుస్తున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లాలో గత పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఓట్లు వచ్చినందున రాబోయే రోజుల్లోనూ పార్టీని గ్రామ గ్రామానికి తీసుకెళ్తామని తెలిపారు. తొలుత శ్రీలక్ష్మీ నర్సింహస్వామి దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు చావాకిరణ్, టూటౌన్ అధ్యక్షుడు భద్రం, నాయకులు శ్రీనివాసరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారులకు న్యాయం చేయాలి



రాజన్నపేటలో భూములను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెంకు సమీపాన ఉన్న రాజన్నపేట గ్రామంలోని పట్టాదారు భూముల్లో ప్రభుత్వ భూములుగా నమోదు చేసి హద్దులు నిర్ణయించడాన్ని సీపీఐ నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె.జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్ తదితరులు భూములను పరిశీలించారు. ఇప్పటికీ అక్కడ శిథిలావస్థలో ఉన్న ఇళ్లు ఉండడాన్ని చూసి ఏళ్లుగా ఉంటున్న వారి భూముల్లో ప్రభుత్వ భూములని బోర్డులు ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన రైతులకు భూములను అప్పగించాలని ఈ విషయమై మంత్రులు, ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వం ఆలోచనజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వలరాజు, బాధిత రైతులు షరీఫ్, నజీర్, నన్నెమియా, జానిమియా,పర్సా సోమయ్య, రజ్జు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ ఆధ్వర్యాన ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ.. గత నాలుగు నెలలుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతోవారి కుటుంబాలు గడవని పరిస్థితులు ఉన్నాయని, దీంతో రోజువారి కూలికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జీతాలు ఇవ్వని కాంట్రాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జూలై 3 నుంచి విధులు బహిష్కరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో యూని యన్ నాయకులు వెంకటరమణ, అంబేద్కర్, అంజలి, సీతారాములు, మరియమ్మ, పద్మ పాల్గొన్నారు.


యువకుడికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: మండలంలోని మండ్రాజుపల్లి గ్రామానికి చెందిన సురేష్ శుక్రవారం తన బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించారు.

రోడ్డు పక్కన శిశువు పిండం

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం నుంచి కోదాడ వెళ్లే రహదారి పక్కన సుమారు ఐదు నెలల వయసు కలిగిన శిశువు పిండాన్ని పంచాయతీ సిబ్బంది శుక్రవారం గుర్తించారు. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామపంచాయతీ గుమస్తా సతీష్ కార్యదర్శి తులసీరామ్‌కు సమాచారం ఇచ్చారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా సుమారు ఐదు నెలల వయస్సు కలిగిన మగ శిశువు పిండంగా గుర్తించినట్లు పోలీసులు తెలుపాక పిండాన్ని ఖననం చేయించారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి గ్రామంలో ఇటీవల తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో శుక్రవారం ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపై మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతూ రాస్తారాకో చేశారు. దీంతో రహదారికి ఇరువైపులా రాకపోకలు స్తంభించపోగా.. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై తోట నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకుందామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బాధితులు పాల్గొన్నారు.